క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహబూబ్‌అలీ

కడప ఎడ్యుకేషన్ : కడపలోని నాగరాజుపేటలో మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతం అయింది. డాక్టర్ మహబూబ్‌అలీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 200 మంది దాకా వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో మెడికల్ రెప్స్, మెడికేర్ హాస్పిటల్ సిబ్బంది నూర్, గౌతమి, ఆయేషా, యాస్మిన్, అంజనా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్టించిన అయ్యప్పస్వామి విగ్రహం

వేంపల్లె : కడప–పులివెందుల బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అర్చకులు శంకరమంచి ప్రసాదు శర్మ, వేద పండితులు విగ్రహాలను ప్రతిష్టించారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆశ్రమంలోని వృద్ధులకు వితరణ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ పద్మావతి వృద్ధుల ఆశ్రమంలో స్థానిక దాతలు వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి మనవడు హితాన్ష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. మరో దాత మల్లికార్జున వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆశ్రమ ప్రతినిధులు సురేంద్ర తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయేశ్వరి వృద్ధాశ్రమంలో ఆదివారం మధ్యాహ్నం డాక్టర్ మూరికూటి సూర్యనారాయణరెడ్డి, గంగా లక్ష్మమ్మ దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 21 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మేదర్లకు శిక్షణ

మైదుకూరు : వెదుర్లతో వివిధ రకాల కళాకృతులు, బుట్టలు తయారు చేయడంలో మేదర వృత్తిదారుల సంక్షేమం, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మైదుకూరులో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వ సహకారంతో మేదర్లకు శిక్షణ ఇచ్చి జీ–20 సదస్సులో వారి నైపుణ్యాన్ని ప్రదర్శింపజేస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. రోజుకు 150 మందికి ఫ్లవర్‌వాజ్‌లు, బుట్టలు తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు తమ్మినేని రాఘవేంద్ర, కార్యదర్శి భావనాశి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986– 87 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పలువురు విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 37 సంవత్సరాల తరువాత వారు కలవడంతో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాసేపు సరదాగా గడిపారు. కార్యక్రమంలో శివనాగలక్ష్మి, క్రిష్ణవేణి, రమాకుమారి, బి.వెంకటసుబ్బమ్మ, చంద్రరజిని, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలి

రాజంపేట టౌన్ : విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.సుబ్రమణ్యంరాజు తెలిపారు. ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు ఇటీవల ఉమ్మడి వైఎస్సార్ జిల్లాస్థాయిలో హిందీ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో సుబ్రమణ్యంరాజు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇలాంటి పరీక్షలు విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు దోహదపడగలవని తెలిపారు. హిందీ ఉపాధ్యాయుడైన సర్తాజ్ హుస్సేన్ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తుండటం ఎంతైనా అభినందనీయమని తెలిపారు. టెన్త్ విద్యార్థులు ఇలాంటి పరీక్షలు ఎక్కడ నిర్వహించినా రాయాలని సూచించారు.

భవన నిర్మాణ కార్మికులకు భరోసా

- కార్మికశాఖ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు
- వైఎస్సార్ బీమాలో నమోదైనప్పటికీ గుర్తింపు కార్డు తప్పనిసరి
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సైతం అండగా నిలుస్తోంది. కార్మిక శాఖ ఆధ్వర్యంలో వారికి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటోంది. అయితే కొంత మంది భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమాలో నమోదై ఉన్నప్పటికీ కార్మికులుగా గుర్తింపు కాలేదు. ఇలాంటి వారిపై కార్మికశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గుర్తింపు కార్డులు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో వైఎస్సార్ బీమాలో నమోదైన భవన నిర్మాణ కార్మికుల వివరాలు సేకరిస్తూ గుర్తింపు కార్డు పొందేలా అవగాహన కల్పిస్తున్నారు.

1,50,836 మందికి గుర్తింపు

జిల్లాలో కార్మిక శాఖ రికార్డుల్లో 1,50,830 మంది భవన నిర్మాణ కార్మికులుగా నమోదై ఉన్నారు. అయితే ఇప్పటి వరకు 64,830 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరందరినీ కార్మికశాఖ పరిధిలో భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసి, సంక్షేమ పథకాలు అందజేసేందుకు గ్రామ సచివాలయాల్లో వివరాలు సేకరిస్తున్నారు.

గుర్తింపు కార్డులకు అర్హులు వీరే

భవన నిర్మాణ కార్మికుడిగా గుర్తింపు కార్డు పొందేందుకు వివిధ పనులు చేసే వారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీరికి మట్టిపని చేసేవారు, పునాది గుంతలు తీసేవారు, చదును చేసేవారు, తాపీ మేస్త్రీలు, తాపీకూలీలు, రాడ్‌బెండింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, సెంట్రింగ్ పనివారు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్, బండలు పరిచే వారు, పాలీష్ పని చేసే వారు, సీలింగ్ వర్కర్స్, కంకర పనులు చేసే కార్మికులు, షోకేస్ పని వారు, రోడ్డు నిర్మాణ కార్మికులు, రోలర్ డ్రైవర్లు, జేసీబీ, బుల్‌డోజర్, క్రేన్ ఆపరేటర్లు, నిర్మాణ రంగంలోని సూపర్‌వైజర్లు, క్లర్కులు, అకౌంటెంట్లు, పాత భవనాలు పగులగొట్టే వారు, వాహనాల ద్వారా పారబోసే కార్మికులు, ఇటుకల తయారీదారులు, క్వారీ కార్మికులు, బావులు, చెరువులు తవ్వడం, పూడిక తీయడం, బోరు గుంతలు పని చేసే వారు, రోలింగ్ షట్టర్ పని వారు, ఐరన్ గ్రిల్స్, డోర్లు, వెల్డింగ్ పనివారు, గ్లాస్ వుడ్ పార్టిషియన్ వర్కర్లు, వుడ్ క్వారింగ్ చిత్రీకరణ చేసేవారు, ఎలివేషన్ వర్కర్లు, సిమెంటు, ఇటుకలు పోల్స్ తయారు చేసే వారిని భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించి కార్డు ఇవ్వనున్నారు. కార్మికుడికి 18–60 ఏళ్ల ఉండాలి. కనీసం 90 రోజులు నిర్మాణ రంగంలో పని చేసి ఉండాలి.

గుర్తింపు కార్డుతో ప్రయోజనాలు

భవన నిర్మాణ కార్మికుడిగా గుర్తింపు కార్డు కలిగిన వారికి ప్రభుత్వం అనేక ప్రయోజనాలు కల్పించనుంది.

- మహిళా కార్మికురాలు, కార్మికుని భార్య, కుమార్తె ప్రసూతి సాయం కింద రెండు కాన్పుల వరకు ఒక్కో కాన్పునకు రూ.20 వేలు అందజేస్తారు.
- వైఎస్సార్ పెళ్లికానుకకు అర్హత లేని సామాజిక వర్గానికి ఈ గుర్తింపు కార్డుతో రూ. 40 వేల సాయం అందిస్తారు.
- కార్మికునిగా గుర్తింపు కార్డు ఉంటే ప్రమాదవశాత్తు మరణిస్తే అతని కుటుంబానికి రూ.5 లక్షలు అందజేస్తారు.
- కార్మికుడు సహజంగా మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక సాయం కింద రూ.60 వేలు అందిస్తారు.
- కార్మికుడి దహన సంస్కారాల నిమిత్తం రూ.20 వేలు ఇస్తారు.
- గుర్తింపుకార్డు లేకుండా పని చేస్తూ ప్రమాదవశాత్తు 50 శాతం అంగవైకల్యం కలిగిన వారికి రూ.20 వేలు అందజేస్తారు. వీటితోపాటు కార్మికుల పిల్లలు చదువుతుంటే స్కాలర్‌షిప్పులు అందజేస్తారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి



భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులందరికీ గుర్తింపుకార్డు తప్పనిసరిగా ఉండాలి. దీనివల్ల కార్మికుడితో పాటు కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయి. వైఎస్సార్ బీమాలో అత్యధికంగా భవన నిర్మాణ కార్మికులు నమోదయ్యారు. వీరితో ఉపాధి వేతన దారులు కూడా ఉన్నారు. వారంతా భవన నిర్మాణ కార్మికులుగా గుర్తింపు చేసుకోవాలి.

– శ్రీకాంత్‌నాయక్, ఉప కార్మికశాఖ అధికారి, కడప

ఏప్రిల్ వరకు మమ్మల్ని తొలగించే అర్హత లేదు

- ఏపీటీఎఫ్ అన్నమయ్య జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ అన్నమయ్య జిల్లా శాఖ అధ్యక్షుడు అలీఖాన్

కడప ఎడ్యుకేషన్ : జిల్లా శాఖకు సమాచారం లేకుండా రాష్ట్ర శాఖ కొత్త కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించడం నిబంధనలకు వ్యతిరేకమని ఏపీటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, చెంగల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడప ఏపీటీఎఫ్ కార్యాలయంలో అన్నమయ్య, కడప జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా శాఖకు సమాచారం లేకుండా కొత్త కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ ప్రకటించడం సరికాదన్నారు. ఇది రాష్ట్ర శాఖ కక్షసాధింపు చర్య అన్నారు. 2024 ఏప్రిల్ వరకు ఎన్నుకున్న తమను తొలగించే అర్హత ఎవరికీ లేదన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు మాట్లాడుతూ ఏకపక్షంగా అన్నమయ్య జిల్లాశాఖను రాష్ట్రశాఖ తొలగించడం అన్యాయమన్నారు. సత్వరం రాష్ట్రశాఖ జరిగిన తప్పును సరిదిద్దుకోవాలని అన్నారు. లేకపోతే సంఘం ప్రతిష్ట దిగజారిపోతుందన్నారు. ఏపీటీఎఫ్ కడప జిల్లా అసోసియేట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, సీపీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రశాఖ ఏపీటీఎఫ్‌ను రాజకీయ పార్టీగా మార్చుతోందన్నారు. మధ్యంతర కౌన్సిల్ పేరుతో జిల్లా కమిటీలను తొలగించుటకు రాష్ట్రశాఖ పథక రచన చేయడం దారుణం అన్నారు. న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రతినిధులు ఉమాకాంత్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి





కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు, మాట్లాడుతున్న ముఫ్తి అహ్మదుల్లా నిసార్ ఖాస్మి

కమలాపురం : ప్రతి ముస్లిం మహమ్మద్ ప్రవక్త (సా.అ.) జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన మౌలానా ముఫ్తి అహ్మదుల్లా నిసార్ ఖాస్మి తెలిపారు. స్థానిక ముస్లిం కమ్యూనిటీ షాదిఖానాలో నిర్వహించిన తన్‌జీముల్ మకాతిబ్ కమలాపురం కే జేరే ఎహ్‌తిమామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం మహ్మద్ ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవనం సాగించాలన్నారు. చాలా మంది పిల్లలు దీన్‌కు దూరంగా ఉంటున్నారని, కమలాపురంలో మదరసాలు ఏర్పాటు చేసి దీన్ గురించి వివరించడం సంతోషకరమన్నారు. సెల్‌ఫోన్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. వాటి వల్ల చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. బద్వేల్‌కు చెందిన మౌలానా ముఫ్తి అబ్దుల్ హాది సాహెబ్, అనంతపురంకు చెందిన ముఫ్తి సైఫుల్లా ముజాహిరి ప్రసంగించారు. అనంతరం సమావేశానికి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని మదరసాల గురువులు, విద్యార్థులు,తల్లి దండ్రులు పాల్గొన్నారు.

పరీక్షల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతి పూజ
- విద్యార్థులకు పలు సూచనలు చేసిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్



విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న అధ్యాపకులు

రాజంపేట టౌన్ : ఈనెల 15వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందువల్ల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ బండి చంద్రమోహన్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు ముగిసే వరకు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటిలో తల్లిదండ్రులు, తోడపుట్టిన వారి మధ్య చిన్నపాటి కొట్లాటలు వంటివి జరిగినా వాటిని అస్సలు పట్టించుకోవద్దన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు టీవీ, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి మనస్సును ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలని తెలిపారు. రాత్రి వేళల్లో ఎక్కువ సమయం మేల్కొని చదవకుండా వేకువజామున లేచి చదవాలన్నారు. రోజుకు ఎనిమిది గంటలకు తక్కువ కాకుండా నిద్రపోవాలని తెలిపారు. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున నీరు, మజ్జిగను ఎక్కువగా తాగాలని తెలిపారు. విద్యార్థులు ఏడాది పాటు కష్టపడి చదివారని, ఆ కష్టానికి ప్రతిఫలం దక్కాలంటే మరో ఇరవై రోజుల పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనావుందని తెలిపారు. విద్యార్థులందరు పరీక్షలు బాగారాసి అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. తొలుత అమ్మవారిశాల ఆలయ అర్చకులు పద్మనాభ సోమయాజులనరసింహ కళాశాలలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద విద్యార్థుల హాల్ టికెట్లు ఉంచి విశేషంగా పూజలు నిర్వహించారు.

శిల్పారామంలో ఆట–పాట





శిల్పారామంలో పులివెందుల ఎస్‌కే డ్యాన్స్ అకాడమి విద్యార్థిని, విద్యార్థుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా పులివెందుల ఎస్‌కే డ్యాన్స్ అకాడమి విద్యార్థులు, చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. వారు ప్రదర్శించిన పలు నృత్యాలకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. శిల్పారామయం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న జీవీఆర్ సంస్థ నిర్వాహకుడు వెంకటరమణ

ప్రొద్దుటూరు కల్చరల్ : అందరి సహకారంతోనే బలిజ కులాభివృద్ధి సాధ్యమని జీవీఆర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు, విశ్రాంత ఇంజినీరింగ్ అధికారి జి.వెంకటరమణ తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరులోని కేఎస్‌ఆర్, సీఆర్‌సీ బలిజ కల్యాణ మండపంలో జీవీఆర్ ఉచిత బలిజ కుల వివాహ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యారేజ్ బ్యూరోలతో సంబంధం లేకుండా బలిజ వర్గీయులు నేరుగా వధూవరులను ఎంపిక చేసుకునేందుకే ఈ కార్యక్రమాలను రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో 60 మంది వధూవరుల తల్లిదండ్రులు పాల్గొనగా వారికి జీవీఆర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమాన్ని బలిజ సంఘం కార్యదర్శి అల్లం చంద్రశేఖర్ నిర్వహించారు. జి.రామకృష్ణ రాయల్, ఆవుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ అసత్య ప్రచారం



జమ్మలమడుగులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండాపోతుందనే భయంతోనే వైఎస్సార్‌సీపీపై అసత్యప్రచారం చేస్తోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టి మాట్లాడారు. టీడీపీని ప్రజలు మరచిపోయే రోజులు వస్తున్నాయని ప్రజలు ఇప్పటికే అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టంకట్టారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అన్నివర్గాల ప్రజలు మద్దతు పలుకుతుండటంతో టీడీపీ ఎక్కడ కనిపించకుండపోతుందనే భయంతో నాయకులు వైఎస్సార్‌సీపీ డబ్బులు పంపిణీ చేస్తుందంటూ ప్రజల్లో అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. అనంతరం కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవమైన పి.రామసుబ్బారెడ్డిని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శివారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావమే ఒక చరిత్ర

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



కమలాపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవమే ఒక చరిత్ర అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలతో కలసి పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. ప్రజల కష్టాలు తొలగించి వారికి మంచి సేవలు అందించాలన్న దృఢ సంకల్పంతో వైఎస్సార్ సీపీని స్థాపించారని, ఆ పార్టీ ఆవిర్భావమే ఒక చరిత్ర అని అన్నారు. 12 పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ని కష్టాలు, ఒడిదడుకులు వచ్చినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగారన్నారు. చిన్న వయస్సులోనే పెద్దపార్టీగా నిలిచిందన్నారు. పార్టీ వెంట ఉన్న కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలన్నారు. వైఎస్సార్ సీపీని ప్రజలు రాజకీయ పార్టీగా భావించలేదని, తన కుటుంబ పార్టీగా భావించారన్నారు. అందుకే 51 శాతం ఓట్లు, 151 సీట్లతో చరిత్ర సృష్టించారన్నారను. మెనిఫెస్టోలను అధికారంలోకి వచ్చాక పార్టీలన్నీ చెత్తబుట్టలో పడేస్తారని, కానీ సీఎం మెనిఫెస్టోను ఖురాన్, భగవద్గీత, బైబిల్‌గా భావించి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. ఎలాంటి అనుభవం లేక పోయినా సీఎం వైఎస్ జగన్‌కు చిత్తశుద్ధి ఉందన్నారు. అందుకే కరోనా కష్ట కాలంలో సైతం ప్రజలెవరూ ఇబ్బందులు పడకుండా సంక్షేమ పథకాలన్నీ కొనసాగించారన్నారు. 13లక్షల కోటతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, మరో ఐదారేళ్లలో అవన్నీ గ్రౌండింగ్ అవుతాయన్నారు. అపుడు ప్రతిపక్షాలన్నీ నోరెళ్లబెట్టుకోవాల్సిందేనన్నారు. 2024లో కూడా జగన్‌ను సీఎం చేసుకోవడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని, 175కు 175 సీట్లు రావడం తథ్యం అన్నారు. సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానమే ఒక చరిత్ర అన్నారు. 2011లో పార్టీ ప్రారంభించి ఎంపీగా పోటీ చేసి 5.45 లక్షల మెజార్టీతో గెలిచి చరిత్ర సృష్టించారన్నారు. ప్రజల సంక్షేమమే శ్వాసగా పయనిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని 2024 తిరిగి సీఎం చేసుకోవాలని ప్రజలు కంకణం కట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నిమ్మకాలయ సుధాకర్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, హిదాయత్, చెన్న కేశవరెడ్డి, అల్లె రాజారెడ్డి, మునిరెడ్డి, నిఖిల్‌రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, దేవదానం, జగన్‌మోహన్‌రెడ్డి, రెడ్డి కరీం, లక్ష్మీనారాయణరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మర్రి సుబ్బన్న, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

చింతకోటమ్మ తిరునాల ప్రారంభం

సుండుపల్లె (వీరబల్లి) : మండల పరిధిలోని చిన్న గొల్లపల్లె గ్రామ పంచాయతీ, పూజారివాండ్లపల్లె వద్ద వెలసిన ప్రాచీన గ్రామ దేవత చింతకోటమ్మ తిరునాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరునాల ఉత్సవాలలో భాగంగా గత 10 రోజులుగా గ్రామ పంచాయతీలోని పలు గ్రామాలలో భక్తుల దర్శనార్థం పల్లకీలో అమ్మవారిని ఊరేగించి ఆదివారం ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగుబ్యాలు పెట్టడం, పుట్ట పూజించుట, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం ఉదయం పుట్ట బంగారు తెచ్చుట, పొంగుబాలు పెట్టుట, తొగట వీర క్షత్రియుల వీరగాసి విన్యాసాలు, కల్లు పోయుట, ఆశాదివారిచే అమ్మవారి కథ చెప్పడం, గ్రామ ప్రజలు బోనాలు సమర్పించడం, రాత్రికి అంగరంగ వైభవంగా విద్యుత్ దీపాలంకరణలతో, చెక్కభజనలతో కోలాటాల మధ్య ఛాందినీ బండ్లు ఊరేగింపు జరుగనున్నాయి.

ఘన జీవామృతంతో చీడపీడల నివారణ

లక్కిరెడ్డిపల్లి : ఘన జీవామృతంతో మామిడిలో చీడపీడల నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారిణి సరస్వతి పేర్కొన్నారు. ఆదివారం దప్పేపల్లి పంచాయతీలోని కొండవాండ్లపల్లెలో 14 ఎకరాల మామిడి తోటకు ఘనజీవామృతం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, జీవామృతం మామిడిలో చీడపీడలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మామిడిలో పూత, పిందె రాలకుండా కాయ వస్తుందని ఆమె తెలియజేశారు. రైతు సోమశేఖర్ రెడ్డి 14 ఎకరాలలో కషాయాలు ఉపయోగిస్తున్నారని ఆమె తెలిపారు. ఘనజీవామృతం 22 టన్నులు, ద్రవ జీవామృతం 15 వేల లీటర్లు తయారు చేసి మామిడి తోటలకు పిచికారీ చేస్తున్నామని ఆమె తెలిపారు. ప్రతి రైతు తమకు అందుబాటులో ఉండే ఆకులు ద్వారా ప్రకృతి ఎరువులు తయారు చేసుకొని పొలాలకు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు అంజనమ్మ, చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

17 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం వైద్యులు 17మంది రోగులకు కంటి ఆపరేషన్లు నిర్వహించారు. కంటి ఆసుపత్రిలో నిర్వహించిన వైద్యశిబిరానికి అన్నమయ్యతో పాటు సత్యసాయి జిల్లాలోని పలు నియోజకవర్గాల నుండి సుమారు 50మంది కంటిరోగులు విచ్చేశారు. కంటి వైద్యుడు సురేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం 50 మందికి పైగా రోగులకు కంటిపరీక్షలు నిర్వహించింది. వీరిలో 17 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ఆపరేషన్లు నిర్వహించారు. అనంతరం గతంలో ఆపరేషన్‌లు చేయించుకున్న 35 మందికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ స్వరూప్ గుప్తా, క్లబ్ మాజీ అధ్యక్షుడు చెన్నూరు అన్వర్‌బాషా, కంటివైద్యులు మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఎం.రాజగోపాల్‌రెడ్డితో పాటు ఆసుపత్రి సిబ్బంది, రోగుల సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో తాళిని చూపుతున్న వేద పండితులు

వల్లూరు : స్థానిక శ్రీ భవానీ శంకర ఆలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు ఆధ్వర్యంలో వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాన్ని, శ్రీచక్ర సహిత భవానీ మాతకు కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వల్లూరు శివరాం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మకు బోనాలు



తిప్పిరెడ్డిపల్లెలో బోనాలు తీసుకెళుతున్న మహిళలు

చాపాడు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం ఘనంగా గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో 30 ఏళ్ల తర్వాత గ్రామ ప్రజలందరూ ఏకమై జాతర వైభవంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై గంగమ్మ తల్లి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి గంగమ్మకు బోనాలు సమర్పించారు. ప్రతి ఇంటికి పెద్ద ఎత్తున బంధువులు రావటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మలకాటిపల్లె గ్రామ సమీపంలోని వీరగంగమ్మ దేవస్థానం ఉత్సవాల సందర్భంగా ఆఖరి రోజున ఆదివారం వీరగంగమ్మ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా బండలాగుడు పోటీలను ప్రారంభించారు. పోటీలు ఆద్యంతం రసవత్తరంగా జరిగాయి. బండలాగుడు పోటీలలో కడప జిల్లా బి. చెర్లోపల్లి చెందిన నంద్యాల శివరామ్ రెడ్డి సంబంధించిన కాడ్లు మొదటి స్థానం, అనంతపురం జిల్లా క్రిష్టాపురానికి చెందిన నాగరాజు, రామచంద్రారెడ్డి సంబంధించిన కాడ్లు ద్వితీయ స్థానం, అన్నమయ్య జిల్లా నందలూరుకి చెందిన షేక్ హబీబుల్లా కాడ్లు మూడవ స్థానం, నంద్యాల జిల్లా, పీఆర్ పల్లికి నాగయ్య ఎద్ల కాడ్లు నాలుగవ స్థానం, చివరగా 5వ స్థానంలో కడప జిల్లా చద్దిపిరాళ్లకు చెందిన బాలరాజు సత్తెలోలు, చల్లాశివరెడ్డి ఎడ్లకాడ్లు నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.